ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పల్నాడు
జిల్లా వార్తలు

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

అమృత్ 2.0 ఆమోదం


నరసరావుపేటలో అభివృద్ధి చేయనున్న కత్తవ చెరువు

పురాల్లో పట్టాలెక్కనున్న పనులు

- రూ.964.31 కోట్లతో ప్రణాళికలు సిద్ధం
- కేంద్రం నుంచి 50 శాతం నిధులు మంజూరు
- వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులకు మోక్షం
- రాష్ట్ర ప్రభుత్వ, మున్సిపల్ వాటాగా ఆర్థిక సంఘం నిధులు
- పురపాలక సంఘాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

అమృత్ 2.0 ఆమోదంతో మున్సిపాలిటీల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య తీరనున్నది. ఈ పథకం కింద తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం, తాగునీటి చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టనున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పురాల్లో అమృత్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ పనులను కూడా అమృత్ 2.0లో చేర్చారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో నిలిచిపోయిన పనులు చేపట్టేందుకు తాజాగా వ్యయ అంచనాలను అధికారులు రూపొందించారు. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఆ డీపీఆర్‌లను బుధవారం ఆమోదించింది. దీంతో అమృత్ పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. మున్సిపాల్టీలలో తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో విస్తరించి నూరు శాతం గృహాలకు కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీరు ఇచ్చే దిశగా పనులు చేపట్టనున్నారు.


నరసరావుపేటలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ కేంద్రాల్లో ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అమృత్ పనులకు ఆమోదంతో మున్సిపాల్టీలకు మహర్దశ పట్టనుంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపాల్టీలు దామాషా ప్రకారం అమృత్ పనులకు నిధులు సమకూరనున్నాయి. దాదాపు రూ.964.31 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయి. కేంద్రం వాటా కింద 50 శాతం నిధులు మంజూరయ్యాయి. మున్సిపల్ పట్టణాల్లోని ప్రతి ఇంటికి నీటి కూళాయి కనెక్షన్ ఇవ్వాలని, సురక్షితమైన తాగునీరు అందించాలన్నది అమృత్ లక్ష్యం. అయితే గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అమృత్ లక్ష్యం నీరుగారిపోయింది. వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకపోవడంతో పాటు కేంద్రం విడుదల చేసిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించుకుంది. దీంతో అమృత్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో తాజాగా అమృత్ పనులకు ఆమోదంతో పురాల్లో పనులు త్వరితగతిన చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అమృత్-1 పథకంలో నిలిచిపోయిన పనులను కూడా కొన్నింటిని అమృత్ 2.0లో చేర్చారు. అమృత్ పనులకు నిధుల భారం రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపాల్టీలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం

(మిగతా 8వ పేజీలో)

వ్యయం అంచనా వివరాలు

మున్సిపాల్టీ	వ్యయం (రూ.కోట్లలో)
పల్నాడు జిల్లా..	
నరసరావుపేట	29.42
చిలకలూరిపేట	160.90
వినుకొండ	29.57
దాచేపల్లి	8.61
పిడుగురాళ్ల	36.29
గురజాల	5.27
మాచర్ల	43.43
సత్తెనపల్లి	0.72
గుంటూరు జిల్లా..	
గుంటూరుకార్పొరేషన్	381.12
మంగళగిరి-తాడేపల్లి	76.43
తెనాలి	61.61
పొన్నూరు	22.10
బాపట్ల జిల్లా..	
చీరాల	32.68
బాపట్ల	25.32
రేపల్లే	45.74
అద్దంకి	5.10

నామినేషన్లకు ఇక రెండు రోజులే

- నేడు, 10 తేదీల్లో మాత్రమే అవకాశం
- 8, 9 తేదీల్లో రెండో శని, ఆదివారం సెలవుదినాలు

8 దూరవిద్య పీజీ ఫలితాలు విడుదల

6 సీఈవో మాకొద్దు

◆ జిల్లా పరిషత్‌ను భ్రష్టుపట్టించారు ◆ పంచాయతీ రాజ్ మంత్రి, కమిషనర్‌కు లేఖ రాసిన జడ్పీ చైర్‌పర్సన్

కోర్టులో లొంగిపోయిన సాయిసాధన చిట్‌ఫండ్ నిర్వాహకుడు

సంస్థ కార్యాలయంలోని ఫైళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): డిపాజిట్‌దారులను, చందాదారులను మోసగించిన కేసులో నిందితుడైన సాయిసాధన చిట్‌ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు గురువారం గుంటూరు కోర్టులో లొంగిపోయాడు. జడ్జి రిమాండ్ విధించారు. గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్లో పుల్లారావుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నరసరావుపేట పల్నాడు బస్టాండ్‌లోని సాయిసాధన చిట్‌ఫండ్ కార్యాలయంపై గురువారం సాయంత్రం డీఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వ ర్యంలో తహసీల్దారు వేణుగోపాలరావు సమక్షంలో కీలకమైన ఫైళ్లను పలు ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల అనంతరం కార్యాలయాన్ని సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు 43 మంది బాధితులు పోలీసులను సంప్రదించారన్నారు. బాధితుల ఫిర్యాదు ప్రకారం రూ.10 కోట్లు చెల్లించాల్సినట్లు తేలిందన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. చిట్‌ఫండ్ సంస్థకు సంబంధించిన రికార్డులను ఇవ్వాలని నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను రెండో పట్టణ సీఐ హైమారావ్, ఎస్ఐ అశోక్‌బాబు కోరారు. దీంతో అధికారులు సంబంధిత రికార్డులను వెతికే పనిలో నిమగ్నమయ్యారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దాలి
- రీజనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి

శావల్యాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి తెలిపారు. శావల్యాపురం మండలం పోట్లూరులో జడ్పీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళతో కలసి గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల్లో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. కాంపిటేటివ్ పరీక్షల వైపు విద్యార్థులు మొగ్గుచూపేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను ఆర్జేడి పరిశీలించారు. పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, ఉపాధ్యాయులు కోరగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.


పోట్లూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

పాఠశాలల్లోనే భోజనం చేయాలి : డీఈవో

విద్యార్థులందరూ పాఠశాలల్లోనే మధ్యాహ్న భోజనం చేయాలని డీఈవో చంద్రకళ తెలిపారు. వేల్పూరులోని జడ్పీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఎక్కువమంది ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకోవడాన్ని పరిశీలించిన డీఈవో అందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేసేలా వంటకాలు రుచికరంగా వండాలని ఎండీఎం ఆపరేటర్‌కు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ నిర్మాణం చేయించాలని, రెండో విడత నాడు-నేడులో వాటర్‌ప్లాంట్ మంజూరైనా ఇంకా ఏర్పాటు చేయలేదని హెచ్‌ఎం మహబూబ్‌సుభాని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు.

బీసీల అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉంది

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపులో పది శాతం రిజర్వేషన్ కల్పించటం టీడీపీ బీసీల పార్టీ అనటానికి నిదర్శనమని రాష్ట్ర నీర, గీత కార్మిక ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు తాత జయ ప్రకాష్ నారాయణ అన్నారు. గురువారం సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పుడూ బీసీలకు అండగా ఉంటూ బీసీ సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు 335 షాపులు కేటాయించటంపై బీసీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. గీత కార్మికుల ఆర్థిక బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. లైసెన్స్ ఫీజులో గీత కార్మికులకు 50 శాతం రాయితీ కల్పించిందన్నారు. గీత కార్మికులకు పది శాతం మద్యం దుకాణాలు కేటాయించ కూడదని హైకోర్టులో తన మనుషుల చేత 30 రిట్ పిటీషన్‌లను వైఎస్ జగన్ దాఖలు చేయించాడన్నారు. మద్యం దుకాణాలు కేటాయిస్తే గీత కార్మికులు ఆర్థికంగా బలోపేతం అవుతారని భావించి, దీన్ని అడ్డుకొనేందుకు వైఎస్ జగన్ పన్నాగం పన్నారన్నారు. జగన్ బీసీల వ్యతిరేకి అని మరోసారి రుజువైందన్నారు. వైసీపీ పాలనలో బీసీలను జగన్‌మోహన్‌రెడ్డి అణిచి వేశారన్నారు. వైసీపీ పాలనలో పదిశాతం రిజర్వేషన్ తగ్గించటం వల్ల 18 వేల మంది బీసీలు రాజకీయ పదవులకు దూరమయ్యారన్నారు. రాజకీయ పదవుల్లో 33 శాతం పదవులు బీసీలకు కేటాయించి వారి రాజకీయ ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం బాటలు వేసిందన్నారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లపాలెం గ్రామంలో 14 క్వింటాళ్ల రేషన్ బియ్యంను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం తాళ్లపాలెం గ్రామంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారంతో బుధవారం రాత్రి రూరల్ పోలీసులు గ్రామంలో సోదాలు నిర్వహించారు. 28 బస్తాలలో నిల్వ ఉన్న రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 547.80 అడుగులు ఉంది. ఇది 204.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6248 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,275 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 31,203 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,099 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఈ సీఈవో మాకొద్దు

- జిల్లా పరిషత్‌ను భ్రష్టు పట్టించారు
- కమీషన్లపై తప్ప.. కార్యాలయంపై శ్రద్ధలేదు
- పంచాయతీ రాజ్ మంత్రి, కమిషనర్‌కు లేఖ రాసిన చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు అవినీతికి హద్దు లేకుండా పోయిందనీ, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు రెండు శాతం మామూళ్లు ముట్టజెప్పాలన్న నిబంధన పెట్టారనీ, ఎంపీడీవోల కార్యాలయాలు, గ్రామ పంచాయతీల తనిఖీకి వెళ్లినప్పుడు రూ. 25 వేలకు తగ్గకుండా కవర్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారని తదితర ఆరోపణలతో ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్, పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా లేఖ రాశారు. జడ్పీ సీఈవోపై అవినీతి ఆరోపణలు చేస్తూ చైర్‌పర్సన్ లేఖ రాయడం సంచలనంగా మారింది. గత కొద్ది రోజులుగా జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినాకు, సీఈవో జ్యోతిబసుకు మధ్య అంతర్గత యుద్ధం జరుగుతుంది. పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలను సైతం సీఈవో పక్కన పడవేస్తుండటం వివాదానికి మూలకారణంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో కొన్ని వందల ఫైళ్లను సీఈవో పరిష్కరించకుండా జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. చివరకు జిల్లా పరిషత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే విద్యా దీవెన స్టడీ మెటీరియల్ వ్యవహారంలో కూడా సీఈవో జడ్పీ చైర్‌పర్సన్ చేసిన సూచనలు బేఖాతార్ చేయటంతో వివాదం ముదిరి పాకాన పడింది.

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు వద్దు

ప్రతి ఏటా జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు జడ్పీ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. విద్యా దీవెన పేరుతో ఈ కార్యక్రమం అమలు జరుగుతుంది. ప్రతి ఏటా ముద్రించే స్టడీ మెటీరియల్‌పై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఫొటోలు ముద్రించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే రీతిలో స్టడీ మెటీరియల్‌పై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫొటోలు వేయాలని చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా సూచించినట్లు తెలుస్తుంది. అందుకు సీఈవో ఒప్పుకోక పోగా, ఆ విషయాన్ని అడ్డం పెట్టుకుని స్టడీ మెటీరియల్ ముద్రణ విషయంలో తీవ్రమైన జాప్యం చేసినట్లు చైర్‌పర్సన్ ఆరోపిస్తున్నారు. కేవలం స్టడీ మెటీరియల్ విషయమై పది సార్లు సమావేశం ఏర్పాటు చేసి డిసెంబరు నెలలో నే విద్యార్థులకు వాటిని అందజేయాలని సూచించినా, టెండర్లు పిలవటానికి నెల రోజులు కాలయాపన చేసినట్లు ఆరోపిస్తున్నారు. చివరకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫొటోలు లేకుండానే విద్యా దీవెన స్టడీ మెటీరియల్ వచ్చేసిందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 13 నెలలుగా జీతాల్లేవు

సీఈవో వైఖరి వలన గత 13 నెలలుగా జడ్పీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కు జీతాల్లేక అల్లాడిపోతున్నారని చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఆరోపిస్తున్నారు.

సీసీ ద్వారా మంత్రి కార్యాలయానికి లేఖ..

పంచాయతీ రాజ్ శాఖ మంత్రిని స్వయంగా కలిసి లేఖను అందజేయాలని చైర్ పర్సన్ తొలుత భావించారు. అయితే ఆయన అనారోగ్యంతో ఉన్నారని తెలుసుకొని లేఖను సీసీ ద్వారా మంత్రి కార్యాలయానికి గురువారం పంపారు. ఉపముఖ్యమంత్రి కోలుకున్న తర్వాత ఆయన్ను స్వయంగా కలిసి సీఈవోపై ఫిర్యాదు చేస్తానని చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణపై సమీక్ష



సమీక్షా సమావేశంలో బాలల హక్కుల కమిషన్ సభ్యులు, అధికారులు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ తిరునాళ్లలో కోటయ్యను దర్శించుకునేందుకు లక్షలాది మంది పెద్దలు, వేలాది మంది చిన్నపిల్లలు హాజరయ్యే అవకాశం ఉన్నందున బాలలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లుపై ఆలయ ప్రాంగణంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆలయ అధికారులు, కార్మిక శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, గ్రామ సచివాలయాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మావతి, ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి చంద్రశేఖర్ ద్వారా గత ఏడాది ఎంతమంది పిల్లలు ఈ ఉత్సవాల్లో పాల్గొని ఉంటారు, వారిలో చంటి పిల్లలు సంఖ్య ఎంత, బాలింతలు ఎంతమంది హాజరై ఉంటారు, అధికారిక లెక్కలు ఉన్నాయా, ఆలయంలో పిల్లలకు ప్రత్యేక పాలసీలు ఏమైనా అమలు చేస్తున్నారా, వాటి వివరాలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది బాలింతలు, చిన్న పిల్లలు స్వామివారి దర్శనానికి ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారా, దివ్యాంగ పిల్లలు దర్శనానికి ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారు తదితర వివరాలు అడిగారు. బాల యాచకులు లేకుండా దేవస్థానం అధికారులు సమన్వయంతో ఎటువంటి చర్యలు చేపట్టారో కార్మిక శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో బాలల హక్కులు, వాటి పరిరక్షణకు సమీక్ష సమావేశాలు నిర్వహించి, సంబంధిత ఉన్నతాధికారులకు వివిధ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కోటప్పకొండ ఆలయ కార్యనిర్వహణ అధికారి దాసరి చంద్రశేఖర్, సీడీపీవో ఉమామహేశ్వరి, వై.ప్రశాంత్‌కుమార్, ఆదిలక్ష్మి, ఎం.వాణి, జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జలవిహార్, ఫుడ్‌కోర్టులు సిద్ధం చేస్తాం

- పర్యాటక శాఖ జిల్లా అధికారి గంగినేని నాయుడమ్మ



జలవిహార్‌ను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ అధికారి గంగినేని నాయుడమ్మ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరగనున్న తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఏర్పాట్ల నిర్వహణలో పర్యాటక శాఖ ఉత్సాహం చూపించడంలేదు. ఈ నేపథ్యంలో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కోటప్పకొండలో ఉద్యానవనం వెలవెల అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పర్యాటక శాఖ జిల్లా అధికారి గంగినేని నాయుడమ్మ గురువారం కోటప్పకొండలోని మెట్లమార్గం వద్ద గల జలవిహార్, ఫుడ్‌కోర్టులను పరిశీలించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి గంగినేని నాయుడమ్మ మాట్లాడుతూ కొండ కింద మెట్లమార్గం వద్ద గల జలవిహార్, ఫుడ్‌కోర్ట్‌ను ఎటువంటి నిర్వహణ వ్యయం లేకుండా గుత్తేదారుడుకి ఇచ్చినా కూడా నిర్వహించలేనని వెళ్లిపోయాడన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు రానున్న శివరాత్రి మహోత్సవం సందర్భంగా జలవిహార్, ఫుడ్ కోర్ట్ సందర్శకులకు సౌకర్యాలు అందించాలని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. వారు దానిని బాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, శివరాత్రి మహోత్సవం రోజుకి ఫుడ్‌కోర్ట్, జలవిహార్‌లో కనీసం రెండు లేదా మూడు పెడల్ బోట్స్‌తో పర్యాటకులకు సౌకర్యం కల్పించే విధంగా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తదనంతరం ఎవరైనా గుత్తేదారులు ముందుకు వస్తే నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ టెండర్లు కూడా సిద్ధం చేస్తున్నారని తెలిపారు.

నేటితో ఇసుక తవ్వకాలకు ముగియనున్న అనుమతులు




గాజుల్లంక వద్ద ప్రభుత్వ ఉచిత ఇసుక డంపింగ్ యార్డు

కొల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత ఇసుక రీచ్‌ల కాలపరిమితి శుక్రవారంతో ముగియనుంది. ప్రజల అవసరార్థం కొల్లూరు మండలం గాజుల్లంకలో ప్రభుత్వం ఉచిత ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసింది. గత అక్టోబరు 16న గుత్తేదారులకు కృష్ణానదిలో ఉచిత ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. అప్పటి నుంచి గుత్తేదారులు కృష్ణానదిలో తవ్వకాలు చేసి నది ఒడ్డున ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో ఇసుక నిల్వ చేసి వినియోగదారులకు అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన ధరలు మాత్రం ఎక్కడా అమలు కాకపోవడంతో వినియోగదారులకు ఉచిత ఇసుక అందని ద్రాక్షగా మారింది. గుత్తేదారులకు మాత్రం కాసుల వర్షం కురిపించింది. ఇసుక తవ్వకాల్లో గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు ఎక్కడా అమలు కాకపోవడం గమనార్హం. ఉచిత ఇసుక తవ్వకాల పేరుతో గుత్తేదారులు అప్పటి నుంచి ఇష్టానుసారంగా నదిలో ఎక్కడబడితే అక్కడ రాత్రి పగలు తేడా లేకుండా తవ్వి సొమ్ము చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు పర్యావరణ అనుమతులు ముగియనుండటంతో ఇక గాజుల్లంక వద్ద కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు నిలిపి వేయాల్సి ఉంది. అయితే గుత్తేదారులు మాత్రం కాలపరిమితి ముగిసినప్పటికీ ఇసుక తవ్వకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతులు పొడిగించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తవ్వకాలు పూర్తిగా నిలిపి వేస్తారో తిరిగి కొనసాగిస్తారో వేచి చూడాల్సిందే.

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం

కృష్ణానదిలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మండల పరిధిలోని గాజుల్లంక ఇసుక రీచ్‌కు అనుమతులు శుక్రవారం సాయంత్రంతో ముగియనున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని అరవింద వారధి, చిలుమూరు గ్రామాల వద్ద కృష్ణానదిలో స్థానిక అవసరాల పేరుతో విచ్చలవిడిగా ఇష్టానుసారంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. ఆయా తవ్వకాలను కూడా అడ్డుకుంటామని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతాల్లోనే ఇసుక తవ్వకాలు జరిగేలా చూస్తామన్నారు. అరవింద వారధి, చిలుమూరు వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు నిలువరించేందుకు పోలీసు శాఖలో సమన్వయం చేసుకుని ప్రత్యేక బృందాలను నియమించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

క్రమబద్ధమైన వ్యాయామంతో మానసిక రుగ్మతలు దూరం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇతర అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నడక, వ్యాయామం, యోగా వంటి మంచి అలవాట్లను క్రమం తప్పకుండా పాటిస్తే మానసిక రుగ్మతలు, ఒత్తిడి నుంచి బయటపడవచ్చునని విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. మేనేజింగ్ స్ట్రెస్ డిప్రెషన్ టు ఎన్ హాన్స్ సైకలాజికల్ క్యాపిటల్ అనే అంశంపై వర్సిటీలోని సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ప్రారంభ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ పని ఒత్తిడి అనేది ఈ రోజుల్లో సర్వసాధారణమైన విషయం అన్నారు. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఒత్తిడి నుంచి బయట పడాలంటే సుఖమయ జీవనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ మానవ జీవన ప్రయాణంలో సైకలాజికల్, మెంటల్, ఫిజికల్ హెల్త్ విషయాలలో ఒత్తిడి అధికంగా ఉంటుందన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి .సింహాచలం మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంతో పాటు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, పాలకమండలి సభ్యులు ఇండ్ల రాధా, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి, సదస్సు డైరెక్టర్ ఆచార్య టీడీ విమల ప్రసంగించారు. పరిశోధన పత్రాలను ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన డాక్టర్ రవికాంత్, ఆచార్య ప్రసాద్ బాబు, డాక్టర్ సువర్ణ రాజు, డాక్టర్ స్వాతి, ఆచార్య సరోజ, విభాగం అధ్యాపకులు కె.కృష్ణమోహన్, ఎస్.అనుపమ, బి. ప్రమీలారాణి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారం: కేసు నమోదు

మాచవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి పై కేసు నమోదు చేసిన సంఘటన మండల కేంద్రమైన మాచవరంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాచవరంలోని బుడగ జంగాల కాలనీలో ఓ యువతి ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. ప్రతి రోజూ మాచవరం గ్రామానికి చెందిన నల్లమేకల వెంకటేష్ జీవాలు మేపుకుంటూ ఆ యువతిని చూస్తూ ఉండేవాడు. బుధవారం ఆ యువతి ఇంట్లోకి చొరబడి యువతి నోట్లో బట్టలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో పొలం నుంచి తిరిగి వచ్చిన యువతితల్లిని చూసి వెంకటేష్ పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తండ్రితో యువతి తల్లి జరిగిన సంఘటన వివరించగా వెంటనే చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై మాచవరం పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ సెంటరుపై పోలీసుల దాడి

- ముగ్గురు యువతులు అరెస్టు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోని లలితాదేవి నగర్ మొదటి లైన్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మసాజ్ సెంటరుపై నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ దాడి చేశారు. ఈ దాడులలో నిర్వాహకుడు సుబ్రమణ్యంతోపాటు మరో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. వారిని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. నరసరావుపేట మండలంలో ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన ఆయన హెచ్చరించారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



విజయ్‌కుమార్ (ఫైల్)

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో కుడి కాలువలో దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన గుంటూరు విజయ్‌కుమార్ (28) పట్టణంలోని రింగు రోడ్డు ప్రాంతంలో టీస్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం రేపల్లెకి చెందిన సుబ్బలక్ష్మితో వివాహమైంది. గత కొంతకాలంగా భార్య సుబ్బలక్ష్మితో మనస్పర్థలు రావడంతో ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన విజయ్‌కుమార్ గత మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన అక్క యాగంటి స్వాతి, బావ ఆదినారాయణకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి పట్టణంలోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడికాలువలో దూకాడు. కాగా విజయ్‌కుమార్ మృతదేహం గురువారం దుర్గి వద్ద గల బుగ్గవాగు డ్యాం వద్ద లభ్యమైంది. విషయం తెలుసుకున్న మాచర్ల పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

చేబ్రోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు గురువారం మృతి చెందాడు. చేబ్రోలు ఎస్సై వెంకట కృష్ణ కథనం ప్రకారం విజ్ఞాన్ యూనివర్సిటీ సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న మెట్లకాటి మణికంఠేశ్వర రెడ్డి (25) ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం స్థానికులు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మణికంఠేశ్వర్ రెడ్డి మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మీరెడ్డి ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

చేబ్రోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు - కొమ్మమూరు కాల్వ సమీపంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని చేబ్రోలు పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం కొమ్మమూరు కాల్వ సమీపంలోని మురుగు కాలువలో యువకుడి మృతదేహం ఉందని పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. 30 ఏళ్లలోపు వయసు ఉంటుందనీ, మృతదేహంపై లేత గులాబీ రంగు చొక్కా, నేవీ బ్లూ ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు 8688831384 నంబరుకు సంప్రదించాల్సిందిగా ఎస్సై సూచించారు.

చిత్రకళకు ప్రాణం పోసిన దామెర్ల



సభలో ప్రసంగిస్తున్న ఆచార్య సురేష్ కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన మహా కళాకారుడు దామెర్ల రామారావు అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆర్ట్స్, లా కళాశాల ప్రచార్యులు ఆచార్య ఎమ్.సురేష్ కుమార్ కొనియాడారు. గురువారం తెలుగువారి వైభవాన్ని తన చిత్రాలతో చూపిన మహా కళాకారుడు "దామెర్ల రామారావు" శత వర్ధంతిని పురస్కరించుకొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని లలిత కళల విభాగంలో సంస్మరణ సభను ఆచార్య ఎమ్.సురేష్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణిక, సామాజిక జీవన స్థితిగతులకు ప్రతిరూపాలుగా దామెర్ల రామారావు గీసిన చిత్రాలు నిలుస్తున్నాయని తెలిపారు. రామారావు గీసిన చిత్రాలు తెలుగువారి ఔన్నత్యానికి ప్రతీకని పేర్కొన్నారు. ఆధునిక, సంప్రదాయ చిత్రకళా రీతులను సమన్వయించి పాశ్చాత్య కళారీతుల్ని శోధించి ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన చిత్రకారుడు దామెర్ల అని చెప్పారు. నేటి లలిత కళల విభాగ విద్యార్థులు దామెర్ల రామారావుని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. లలిత కళల విభాగం అధ్యాపకులు జాన్ రత్నబాబు, శ్రీనివాసరావు, పి. దేవకాంత్, బి.శేఖర్ బాబు, పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,33,176 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,36,176 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,33,176 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 74,902 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13600	334	9500	11500
నెంబరు. 5	10000	13300	నెంబరు.5	--	--
273	10500	12000	273	10000	10000
341	10000	14700	341	13200	13200
4884	9500	12000	4884	--	--
సూపర్ 10	10500	14000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	11000	10000
బ్యాడిగి	10000	13500	బ్యాడిగి	9000	12000
దేవనూరు డీలక్స్	10000	13000	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	7500	తెల్లకాయలు	4000	7500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు


కూటమి నేతల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

నాలుగు సార్లు ఓటర్లను కలవాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గంలోని కూటమి నేతలు, కార్యకర్తలు గ్రామాల పరిధిలో ఎంఎల్‌సీ ఓటర్లను నాలుగు సార్లు కలవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎంఎల్‌సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సత్తెనపల్లి రూరల్, రాజుపాలెం మండలాల కూటమి నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన గుంటూరులో ఆలపాటి నామినేషన్ వేస్తున్నారని, కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. సత్తెనపల్లి నియోజక వర్గం నుంచి మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటికి వేయాలన్నారు. నియోజకవర్గ ఎంఎల్‌సీ ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఆలపాటి గెలుపుకు కూటమి నేతలు, కార్యకర్తలంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో తాతా జయప్రకాష్‌నారాయణ, ఎలినేడి రామస్వామి, మక్కపాటి రామచంద్రరరావు, పల్లపాటి పెద్దిరాజు, కొనికినేని సత్యనారాయణ, ఆళ్ళ సాంబయ్య, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, భీమినేని వందనాదేవి, మన్నం శారదాదేవి, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులు దరఖాస్తు చేసుకోండి

● డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు, డీపీఈవో మణికంఠ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో గౌడ, గీత సామాజికవర్గానికి కేటాయించిన మద్యం షాపుల కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి గుంటూరు జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం పిడుగురాళ్ల ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో గౌడ, కల్లుగీత సామాజికవర్గానికి కేటాయించిన 13 మద్యంషాపులకు 46 దరఖాస్తులు అందాయని, కాకుమాను, కొల్లిపర, వట్టిచెరుకూరు మండలాలకు దరఖాస్తులు ఇంకా అందలేదన్నారు. పల్నాడు జిల్లాలో 13 షాపులకు గాను ఇప్పటికి 41 దరఖాస్తులు అందాయని, మాచర్ల, ముప్పాళ్ల మండలాల నుండి దరఖాస్తులు అందాల్సి వుందన్నారు. గౌడ, కల్లుగీత కులస్తులకు కేటాయించిన మద్యం షాపులకు రూ.2లక్షల నాన్‌రిఫండబుల్ అమౌంట్‌తో దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. ఏ జిల్లాకు చెందిన వారు ఆ జిల్లాలోనే మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆయా మండలాల తహసీల్దార్లు గౌడ, కల్లుగీత సామాజికవర్గాలకు చెందినవారికి కుల్రదువీకరణ సర్టిఫికెట్లను ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందజేయాలని, 10వ తేదీన నరసరావుపేటలో లాటరీ తీస్తామన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ మణికంఠ, పిడుగురాళ్ల సీఐ కె.కర్ణా తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ముత్తూట్ ఫైనాన్స్‌లో ప్రజలను మోసచేసిన కేసులో సంస్థకు చెందిన రీజనల్ మేనేజర్ ఏ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ బ్రహ్మయ్య గురువారం తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ పీ ఆదినారాయణ, గోల్డ్ అప్రైజర్ గోపినాథ్ ఇరువురు ఖాతాదారులను మోసంచేసి రూ.8లక్షలకు పైగా డబ్బును దుర్వినియోగం చేశారని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విలేకర్లకు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలోని నిర్మాణం కూల్చివేత

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డవల్లిలో సర్వే నెంబరు 263/1లో అక్రమంగా నిర్మించిన రేకులషెడ్డుని గురువారం కూల్చివేసినట్టు తహసీల్దార్ చక్రవర్తి విలేకరులకు తెలిపారు. సర్వే నెం.263/3లో మూడు ఎకరాల వ్యవసాయభూమిలో నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారి పీ భాస్కర్‌రెడ్డి వ్యవసాయేతర భూమిగా మార్చుకొనుటకు ఎటువంటి దరఖా స్తు చేసుకోకుండా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టడంతో ప్రభుత్వ ఖాళీ డొంక పోరంబోకులో నిర్మించిన షెడ్డును వీఆర్‌వో నరసింహారావు కూల్చి వేయించారని తహసీల్దార్ తెలిపారు. ఇప్పటికే భాస్కర్‌రెడ్డికి నోటీసు కూడా జారీ చేశామన్నారు. సర్వే నెం.262-3లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవని, ఆ భూమిలో ఎవరు ప్లాట్లువేసి విక్రయించినా కొనవద్దని ఆయన తెలిపారు.

నేడు సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల రజతోత్సవం


సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల

రెంటచింతల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నేడు సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల రజతోత్సవాన్ని శుక్రవారం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తైనట్లు కరస్పాండెంట్ పీటర్ పాపయ్య చెప్పారు. ఉదయం పూర్వవిద్యార్థుల ఆత్మీయ పరిచయం, సాయంత్రం బిషప్‌ల నేతృత్వంలో భారీ బహిరంగసభ ఉంటుందన్నారు. ఇక్కడ చదివిన వారు డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, డీజీపీ, ఎమ్మెల్యేలుగా రాణించారన్నారు. యరపతినేని శ్రీనివాసరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నంబూరి శంకరరావు, మక్కెన మల్లికార్జునరావు, కాయితి వెంకటనర్సిరెడ్డి తదితరులు చట్టసభలకు వెళ్లారన్నారు. కాగా డైమండ్ జూబ్లీ వేడుకలకు ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు రూ.2లక్షలు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి రూ.1లక్ష, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రూ.1లక్ష అందజేశారన్నారు.

విద్యార్థుల ఉన్నతే ప్రభుత్వ లక్ష్యం

● జిల్లా బీసీ సంక్షేమాధికారి శివనాగేశ్వరరావు

రెంటచింతల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉన్నతే ప్రభుత్వ లక్ష్యమని, టెన్త్ పరీక్షలకు పక్కా ప్రణాళికలు రూపొందించుకొని చదవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి బొర్రా శివనాగేశ్వరరావు సూచించారు. గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలోని బీసీ బాలుర, బాలికల హాస్టల్‌లో టెన్త్ పరీక్షలు రాయబోయే బాలురు, బాలికలతో ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాస్టల్ వార్డెన్లు సుశీల, గంగాధర్ అధ్యక్షత వహించారు. శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ టెన్త్ పూర్తికాగానే కళాశాల విద్య కోసం బీసీ హాస్టళ్లలో చేరవచ్చని సూచించారు. సమాధానాలు రాసేటప్పుడు సమయపాలన పాటించాలని నొక్కి చెప్పారు. విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో హాస్టల్ హోరెత్తింది. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూవో, ఏఎస్‌డబ్ల్యూవో దయాకర్, సుజాతకుమారి, వార్డెన్లు సుశీల, దీపిక, శ్రీనివాసరావు,గంగాధర్, బెన్హర్ బాబు, పల్లెర్ల కేశవరెడ్డి, విద్యావేత్త శ్రీనివాసరావు, అంజి, బీజేపి మండల అధ్యక్షులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి శివ నాగేశ్వరరావు

సమన్వయంతో భక్తులకు మెరుగైన సేవలు

● ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అమరావతిలో స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లుచేయాలని ఉత్సవ ప్రత్యేక అధికారి, సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి ఆదేశించారు. గురువారం అమరేశ్వరాలయ కార్యాలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆర్డీఓ శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. దేవస్థాన సహాయ కమిషనర్, ఈఓ పి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆలయం సందర్శించే భక్తులకు క్యూలైన్స్, షామియానాలు, విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి ఉచిత ప్రసాదాలు, తాగునీరు అందజేయడం జరుగుతుందన్నారు. మహాశివరాత్రి రోజు అర్ధరాత్రి జరిగే స్వామివార్ల కల్యాణం, మరుసటి రోజు రథోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అగ్నిమాపక అధికారి సుబ్బారావు మాట్లాడుతూ ఉత్సవాలు జరిగే రెండు రోజులు ఫైర్ సర్వీసును, సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. సీఐ అచ్చయ్య మాట్లాడుతూ పండుగ రోజు ఆలయ ప్రాంగణం, స్నానఘాట్‌లు, ప్రధానరహదారిలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తామన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ కె.పద్మజ, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, మత్యశాఖ. ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య శాఖ అధికారులు తమ శాఖలకు సంబంధించి చేపట్టే పనులను వివరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతంలో స్థానిక ప్రజలు, భక్తులు కూడా సహకరించాలని కోరారు.

ఆలపాటి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎంఎల్‌సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం బెల్లంకొండ మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ టీడీపీ కార్యాలయంలో మండలంలోని కూటమి నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పార్టీ అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ మండలంలో 610 ఓట్లు ఉన్నాయని, అందులో 90 శాతం కూటమి అభ్యర్థి ఆలపాటికి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. సమావేశంలో గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, అక్కల వెంకటరామిరెడ్డి, హనుమంతరావు నాయక్, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి, గుడిసె కొండయ్య, వెన్నా సీతారామిరెడ్డి, సయ్యద్ జానీ, పీఎస్‌కే రసూల్, పిచ్చయ్య పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌కు శ్మశానస్థలాన్ని కేటాయించాలి

బెల్లంకొం మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌కు శ్మశాన స్థలాన్ని కేటాయించాలని న్యూ చిట్యాల మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు హనుమంతరావు నాయక్ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు గురువారం విన్నవించారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ నిర్మాణం జరిపి సుమారుగా పది సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు శ్మశానస్థలం లేదని తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ శ్మశానస్థలంలో పాటు రహదారి నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో మాజీ జెడ్పీటీసీ తులసా నాయక్, ఎంపీటీసీ నరసింహారావు నాయక్, వెంకటరావు నాయక్, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి పాల్గొన్నారు.


అచ్చంపేటలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై మాట్లాడుతున్న పరిశీలకుడు నల్లపాటి రాము

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించండి..

అచ్చంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలని ఎన్నికల పరిశీలకుడు నల్లపాటి రాము అన్నారు. గురువారం అచ్చంపేటలోని టీడీపీ కార్యాలయంలో 30మంది ఓటర్లకు ఒక్కో కో-ఆర్డినేటర్ చొప్పున 50మందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాటిబండ్ల బాపిరాజు, తెలుగు యువత మండల యూత్ అధ్యక్షుడు పొన్నెకంటి రవి, ఎనిగండ్ల కోటయ్య, బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలి

క్రోసూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య పిలుపునిచ్చారు. పలువురు టీడీపీ నాయకులతో కలసి గురువారం క్రోసూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రులు, మేధావులు, ఉద్యోగులు ఆలోచనతో ఓటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ అనుముల వెంకట రామిరెడ్డి, టీడీపీ నాయకులు జుజ్జూరి వెంకటరావు, మన్నెం శివయ్య, దుద్దుల యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విస్తృత సమావేశాలు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం నియోజకవర్గంలో పలుచోట్ల విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ఉదయం 10:30 గంటలకు కారంపూడిలో, 11:30కి దుర్గిలో, 12:30కు పట్టణంలోని నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించనున్నారు. సమావేశాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఎన్నికల మాచర్ల నియోజకవర్గ పరిశీలకుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీరెడ్డి పాల్గొంటారు.

నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఈ నెల 10వ తేదీన నామినేషన్ వేయనున్నారని, కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నేత బండ్ల మహేష్ కోరారు. ఈ మేరకు గురువారం కరపత్రాలను మాచర్లలో ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు ఆయేషా సుల్తానా, శ్రీనివాసరావు, సీఐటీయూనేతలు శోభన్‌కుమార్, వెంకటరత్నం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలికి పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

నకరికల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయకుమార్ కోరారు. గురువా రం నకరికల్లులో పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలసి ప్రచారం నిర్వహించారు. సమావేశంలో యూటీఎఫ్, డీవైఎఫ్ఐ, నేతలు కట్టా కోటేశ్వరరావు, వంగల తులసీ, ఈపూరి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పొంజు సేవ

● భారీగా పాల్గొన్న భక్తులు


మోర్జంపాడులో నరసింహా స్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, ఇన్‌సెట్లో స్వామివారు

మాచవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడులోఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి 69వ కల్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం స్వామివారి పొంజు సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌ను పల్లకిలో ఉంచి గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. మాలలు ధరించిన భక్తులు స్వామివారి ఊరేగింపు అనంతరం మాలలను విరమించారు. వివిధ రకాల వేషధారణలతో భక్తులను అలరింపచేశారు. దేవస్థానానికి విద్యుత్ దీపాలు అలంకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారికి జలాభిషేకం చేసి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం సాయంత్రం 5 వరకు కొనసాగింది. సేవా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురువారం దేవాలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయకమిటీ తెలిపింది.

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో గురువారం ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషిచేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకొని వృద్ధిలోకి రావాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకులు వీరవల్లి శ్రీనివాసరావు, కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ రూ.10వేల విరాళాన్ని అందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కావూరి రాజేంద్రప్రసాదు, పి.శ్రీనివాసరావులతో పాటు దరువూరి నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రాజుపాలెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ కోరారు. గురువారం రాజుపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వచ్చినప్పుడు సత్వరమే పరిష్కరించాలన్నారు. తొలుత మండల స్థాయి అధికారులు వారివారి శాఖల ప్రగతి నివేదికను వివరించారు. ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, తహసీల్దార్ దుర్గేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి ప్రవాస భారతీయురాలి వితరణ

పెదకూరపాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని సాయి బాబా ఆలయ ధూపదీప నైవేద్యానికి ప్రవాస భారతీయురాలు రుచిత తన తల్లిదండ్రులు దర్శి సాంబశివరావు, విమల దంపతుల ద్వారా ఆలయ కమిటీ ప్రతినిధి ఘంటా బాబుకు రూ.1.50లక్షల నగదును గురువారం అందించారు. ఈ సందర్భంగా దాత తల్లిదండ్రులను దుశ్శాలువాతో సత్కరించారు.


ఆలయ కమిటీ ప్రతినిధి బాబుకు రూ.1.50 లక్షలను అందిస్తున్న సాంబశివరావు, విమల

రాజీవ్‌రంజన్ మిశ్రాను కలిసిన కుమార్


రాజీవ్‌రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందిస్తున్న కుమార్

మాచర్లటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాను గురువారం తాడేపల్లిలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ కలిశారు. ఎస్సీ వర్గీకరణ లేకపోవడంతో మాదిగలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడ్డారని వివరించారు. 10శాతం మంది ఎస్సీలు మాత్రమే రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారని, మాదిగలకు న్యాయం జరిగేలా వర్గీకరణ చేయాలని వినతిపత్రం అందించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పులిచింతలప్రాజెక్టులో గురువారం 33.66 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

తిరునాళ్ళ హక్కుల వేలంలో రూ.3.30లక్షల ఆదాయం

క్రోసూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలం ఓర్వకల్లు గంగమ్మ తల్లి తిరునాళ్ళలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకొనేందుకు గురువారం క్రోసూరులోని వీరభద్రస్వామి దేవాలయ ఆవరణలో జరిగిన వేలంలో రూ 3.30లక్షలు దేవదాయ శాఖకు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో కోటేశ్వరరావు తెలిపారు. గత సంవత్సరం కన్నా రూ.60వేలు అధికంగా ఆదాయం లభించినట్టు ఆయన తెలిపారు. కొబ్బరి చిప్పలు, చీరలు, జాకెట్ల సేకరణ, లడ్డుప్రసాదం, కొబ్బరికాయల విక్రయం, చెప్పులస్టాండ్ నిర్వహణకు వేలం నిర్వహించామన్నారు. వేలంలో దక్కించుకున్నవారు ఈనెల 11నుంచి 13వరకు, మార్చి 13 నుంచి 15వ తేదీ వరకు దేవస్థానం వద్ద ఆయా వ్యాపారాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. వేలం నిర్వహణలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత

నకరికల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో బుధవారం గల్లంతైన బసప్ప మృతదేహాన్ని గురువారం పోలీసులు వెలికి తీయించారు. బుధవారం చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ డ్రైవర్ బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ వద్ద బట్టలు ఉతుక్కునేందుకు దిగి కాలుజారి గల్లంతైన సంగతి తెలిసిందే.

లగడపాడులో చోరీ

పెదకూరపాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని లగడపాడులో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి వెళ్ళి రూ.1.35లక్షల విలువైన బంగారాన్ని చోరీచేసినట్లు ఎస్ఐ గిరిబాబు గురువారం తెలిపారు. ఈనెల 5వ తేదీన గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌షరీఫ్ పొలం పనులకు వెళ్లారని, అతని తండ్రి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్ళిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి వెళ్ళి బంగారు వస్తువులను దొంగిలించారనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏరియా వైద్యశాలలో అన్నదానం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా ఏరియా వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.రాధా ఆర్థిక సాయంతో గురువారం ఏరియా వైద్యశాలలో 120మంది పేదలకు జనసేన నేత అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యుడు జవ్వాజి రామ్మోహనరావు, ఫార్మాసిస్టు విజయలక్ష్మి, హెడ్ నర్సులు, బంగారు పాప, కె.మాధవి, పట్టణానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రమాదరహిత డ్రైవింగ్ చేయాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ల కుటుంబసభ్యులు వారికి పౌష్టికాహారం అందించటంతోపాటు ఎక్కువ విశ్రాంతి తీసుకొనేలా చూడాలని డిపో మేనేజర్ విజయకుమార్ అన్నారు. గురువారం ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధులకు వెళ్లే సమయంలో, ఇంటి దగ్గర ఉన్నప్పుడు వారి కుటుంబసభ్యులు పాటించాల్సిన ఆహారనియమాలు, విశ్రాంతి సమయంలో తీసుకోవాల్సిన సూచనలు వివరించారు. డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రమాదరహిత డ్రైవింగ్ చేయాలన్నారు. ఈ సదర్బంగా డ్రైవర్ల సతీమణులకు ట్రాఫిక్ సూపర్‌వైజర్ పాతిమా రోశమ్మ జాకెట్ ముక్కలు, గాజులు, తాంబూలం ఇచ్చి సత్కరించారు.

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

కారంపూడి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కారంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్య అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో పలు శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. 10వ తేదీన అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులచే ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్, ఎంఈవో రవికుమార్, ఈవోపీఆర్డీ కసిన్యానాయక్, హెల్త్ సూపర్‌వైజర్ మల్లయ్య, మస్తాన్‌వలి, మణి, లాలునాయక్ పాల్గొన్నారు.

మృతదేహం వెలికితీత - రీపోస్టుమార్టం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మారం పున్నమ్మ గత ఏడాది ఆగస్టులో మృతి చెందింది. పున్నమ్మకు కొడుకు రమణారెడ్డి హైదరాబాద్‌లో వుంటుండగా, కూతురు లక్ష్మీనారాయణమ్మ వద్దనే పున్నమ్మ వుంటోంది. గత ఏడాది ఆగస్టులో పున్నమ్మ మృతిచెందగా అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆ తరువాత పున్నమ్మ పేరిట వున్న ఆస్తి కుమార్తె లక్ష్మీనారాయణమ్మ రాయించుకున్నట్లుగా తెలుసుకున్న కొడుకు రమణారెడ్డి తల్లి పున్నమ్మ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు పిడుగురాళ్లలో పున్నమ్మ మృతదేహాన్ని వెలికితీసి అక్కడికక్కడే రీపోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దార్ మధుబాబు పంచనామా నిర్వహించగా ఎస్ఐ మోహన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దూరవిద్య కేంద్రం పీజీ ఫలితాలు విడుదల


పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో గత అక్టోబరు, నవంబరులో నిర్వహించిన పీజీ కోర్సులు పరీక్షల ఫలితాలను గురువారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కే రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జీ. సింహాచలంలు విడుదల చేశారు. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డీ.రామచంద్రన్ మాట్లాడుతూ 1,2,3,4 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసామన్నారు. ఎంహెచ్‌ఆర్ఎం, ఎంఎల్ఐఎస్సీ, సోషల్ వర్క్, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హిందీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సంస్కృతం, సోషియాలజీ, జర్నలిజం, ఎంకామ్ కోర్సుల ఫలితాలు విడుదలైనట్లు తెలిపారు.

దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫలితాలను దూరవిద్యకేంద్రం వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల అసిస్టెంట్ రిజిస్ట్రార్ డీ.కోదండపాణి మాట్లాడుతూ విద్యార్థులు రీవాల్యువేషన్ చేయించుకోవాలంటే ఆయా దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఒక్కో పేపరుకు రూ. 960 ఈ నెల 24లోగా చెల్లించి దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్‌కు దరఖాస్తు పంపాలన్నారు.

కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య రవికుమార్, ఆచార్య త్రిమూర్తిరావు, పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైను లాబ్దిన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, సిబ్బంది టంక శాల వెంకటేశ్వర్లు, సీటీఏలు లావణ్య, ఉమామహేశ్వరరావు, వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక

పెదకాకాని,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): బైబిలు మిషను స్త్రీల సభల కన్వీనర్, రెండో శనివారం ఉపవాస ప్రార్థనల వ్యవస్థాపక నిర్వాహకులు డాక్టర్ జే. ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక శుక్రవారం ఉదయం 10 గంటలకు పెదకాకాని స్వస్థిశాలలో ప్రారంభమౌతుందని ఆమె కుమారుడు, బైబిలుమిషను అధ్యక్షుడు జే.శామ్యేల్ కిరణ్, కుమార్తె అనీలా జోషి బైబిలుమిషను అధికారులు గురువారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఇప్పటికే కూడిక ఏర్పాట్లు పూర్తయి నట్లు వెల్లడించారు.


ప్రమీల సెల్వరాజ్ (ఫైల్)

భక్తి, సేవకు అంకితం ప్రమీలా సెల్వరాజ్..

ప్రమీలా సెల్వరాజ్ చిన్నతనం నుంచే దైవభక్తి, ప్రార్థనల పట్ల ఆసక్తి కనబర్చారు. బైబిలు మిషను స్థాపకుడు ఫాదర్ ఎం. దేవదాస్ అయ్య ప్రభావంతో ఆ మార్గంలో ముందుకు సాగారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. అనంతర కాలంలో ఆమె బైబిల్ మిషన్ 7వ అధ్యక్షుడు జే. జాన్ సెల్వరాజ్‌ని వివాహం చేసుకున్నారు. వారి కుటుంబం పూర్తిగా దైవ సేవకు అంకితమైంది. ప్రమీలా సెల్వరాజ్ బైబిలు మిషను, గుంటూరు, బేతేలు గృహం ప్రధాన కేంద్రంగా దేశవ్యాప్తంగా అనేక మంది క్రైస్తవ విశ్వాసుల ప్రేమలను పొంది, బైబిల్ మిషన్ స్త్రీల సభలను 38 సంవత్సరాలుగా ప్రతి యేటా సెప్టెంబరులో సమర్థవంతంగా నిర్వహిస్తూ వచ్చారు. ఆమె 1987లో ఏర్పాటుచేసిన రెండో శనివారం ఉపవాస ప్రార్థనలు ఇప్పటికీ తోటలో కొనసాగుతున్నాయి.

దేశవ్యాప్తంగా అనేక మంది భక్తులు కాకాని స్వస్థిశాలకు వచ్చి, దైవదీవెనలు పొందేవారు. పెదకాకాని తోటలో ప్రతి సోమవారం స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తూ, వ్యాధి, బాధలలో ఉన్నవారికి ఓదార్పునిస్తూ, ధైర్యపరుస్తూ ఎందరో విశ్వాసులకు ప్రమీలా సెల్వరాజ్ ఆత్మీయ మార్గదర్శిగా నిలిచారు.

నామినేషన్లకు రెండు రోజులే..

- 7, 10 తేదీల్లో మాత్రమే అవకాశం
- 8, 9 తేదీల్లో రెండో శని, ఆదివారం సెలవుదినాలు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల ఘట్టం తుది దశకు చేరుకొంది. 10వ తేదీ నామినేషన్ల దాఖలుకు ఆఖరు అయినప్పటికీ మధ్యలో రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో శుక్ర, సోమవారం మాత్రమే అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. దీంతో ఈ రెండు రోజుల్లో ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వస్తారని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రధాన అభ్యర్థులైన ఎన్డీయే కూటమి బలపరిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఉదయం నామినేషన్ అందజేయనున్నారు. మరోవైపు సిట్టింగ్ పీడీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సోమవారం నామినేషన్ వేస్తారని ఆయన కార్యాలయవర్గాలు తెలిపాయి. దీంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయా లని పోలీసులకు ఆదేశాలు అందాయి.

ఈ నియోజకవర్గానికి నామినేషన్ల స్వీకార ప్రక్రియ ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఇప్పటివరకు తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సెలవు దినాల్లో నామినేషన్లను స్వీకరించరు. ఈ నేపథ్యంలో 8, 9వ తేదీల్లో అధికారులు నామినేషన్లను తీసుకోరు. దీని దృష్ట్యా శుక్ర, సోమవారాల్లోనే నామినేషన్ పత్రాలను ఆర్వో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని ఆర్వో ఎస్ నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

ఎమ్మెల్సీ ఎన్నికలనిర్వహణ కోసం గుంటూరు కలెక్టరేట్‌లో 24గంటలు పనిచేసేలా కంట్రోల్ రూంని ఏర్పాటు చేశారు. నంబరు. 0863 2979766ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు చేయడానికి, ఎన్నికల సమాచారం తెలుసుకోవడానికి కంట్రోల్‌రూంకి ఫోన్ చేయవచ్చని సూచించారు.

ఉద్యాన పంటలకు ఊతం





- ప్రభుత్వం నుంచి భారీగా రాయితీలు
- అధిక దిగుబడి.. మంచి లాభాలు
- సాగుకి ఆసక్తి చూపుతున్న రైతులు
- మండలంలో అధిక మొత్తంలో సాగు

ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా ప్రోత్సాహక రాయితీలు అందిస్తోంది. దీంతో అధిక సంఖ్యలో రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మళ్లుతున్నారు. ముఖ్యంగా యువ రైతులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, అర్వపల్లి, పమిడిమర్రు, కొండకావూరు, గురవాయపాలెం గ్రామాలలో రైతులు ఉద్యాన పంటలసాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎప్పుడూ సాగుచేసే మిరప, పత్తి, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు ఉద్యాన పంటలను సాగు చేసి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు.

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలంలో రైతులు ఇటీవల అత్యధికంగా డ్రాగన్‌ఫ్రూట్, అరటి, బొప్పాయి పంటలను సాగుచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రాగన్‌ఫ్రూట్ సాగుచేస్తున్న రైతులకు గతంలో 1 హెక్టారుకు 3 సంవత్సరాలకు ప్రోత్సాహక రాయితీగా రూ.30 వేలు అందిస్తుండగా ఈ సంవత్సరం నుంచి రూ. 2.7 లక్షలు అందిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. మామిడి, స్వీట్ ఆరెంజ్, సిట్రస్ వంటి పండ్ల తోటలు సాగుచేస్తున్న రైతులకు గతంలో 1 హెక్టారుకు 3 సంవత్సరాలకు రూ.15 వేలు అందిస్తుండగా ఈ ఏడాది నుంచి రూ 50 వేలు అందించనున్నారు. అలాగే అరటి, సపోటా, జామ, ఆపిల్, జాక్‌ఫ్రూట్ పంటలను సాగుచేస్తున్న రైతులకు గతంలో 1 హెక్టారుకు రూ. 30 వేలు అందిస్తుండగా ఈ ఏడాది నుంచి రూ.70 వేలు ఇవ్వనున్నారు. దీంతో అధిక శాతం మంది రైతులు ఉద్యాన పంటలను సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నరసరావుపేట మండలంలో మామిడి 90 హెక్టార్లు, దొండ తోటలు 80 హెక్టార్లు, టమాటా తోటలు 60 హెక్టార్లు, వంగ తోటలు 30 హెక్టార్లు, బంతి, చామంతి, లిల్లీ, కనకాంబరాలు పూలతోటలు 20 హెక్టార్లు, జామ, సపోటా, దానిమ్మ, అరటి తోటలు 50 హెక్టార్లలో సాగు అవుతున్నాయి. ఉద్యాన శాఖ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఆయా పంటలపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలపై అవగాహన కలిగిస్తున్నారు. తద్వారా ఉద్యావన పంటల సాగు వైపు యువ రైతులు ఆసక్తి కనబరిచేలా కృషి చేస్తున్నారు.


ఉప్పలపాడు గ్రామంలో డ్రాగన్‌ఫ్రూట్ రైతులకు అవగాహన కలిగిస్తున్న జిల్లా ట్రైయిని కలెక్టర్ కల్పన శ్రీ, ఉద్యానశాఖ అధికారులు (ఫైల్ ఫోటో)



కూరగాయల సాగులో అధిక దిగుబడి



ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీలతో కూరగాయల తోటలు సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాం. ఉప్పలపాడు గ్రామంలో టమాటా, వంగ, దొండ, మిరప సాగు చేస్తున్నాను. గతంలో కంటే ఇప్పుడు పంటల దిగుబడి బాగుంది. ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు మా తోటలను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

తన్నీరు నాగేశ్వరరావు, రైతు, ఉప్పలపాడు

డ్రాగన్ ఫ్రూట్ సాగు లాభదాయకంగా ఉంది



డ్రాగన్ ఫ్రూట్ తోటలు సాగుచేస్తున్నాను. మిర్చి, పత్తి, వరి పంటల కంటే పెట్టుబడి ఖర్చు, శారీరక శ్రమ కూడా తక్కువే. డ్రాగన్ ఫ్రూట్ ధర మార్కెట్‌లో అధికంగా ఉంటుంది. దీంతో ఈ సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంది. డ్రాగన్ ఫ్రూట్ పంటలను సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు రూ. 2.7 లక్షలు రాయితీని ప్రకటించింది.

- షేక్ సాంబశివరావు, రైతు, అర్వపల్లి

విజ్ఞాన్స్ మహోత్సవం 2కె25





సంగీత దర్శకులు ఎస్ఎస్ తమన్‌తో డాక్టర్ లావురత్తయ్య, తులసీరెడ్డి తదితరులు


జ్యోతి వెలిగించి వేడుకల్ని ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య.

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చూసేందుకు రెండు కళ్లు చాలనంత.. యువత గుండెల నిండా స్ఫూర్తి నింపేంత ప్రోత్సాహం. మది పులకించేలా సంగీత, సాంస్కృతిక హోరు. యువత ఆటలు, పాటలు, తుళ్లింతలు.. కేరింతలల నడుమ జాతీయ స్థాయి విజ్ఞాన్స్ మహోత్సవ్ గురువారం ప్రారంభమైంది.

చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ప్రారంభమైన ఈ వేడుకలకు భారీ సంఖ్యలో యువత హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ మాట్లాడుతూ యువత చదువుకే పరిమితం కాకుండా సంగీతం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. చదువుతోపాటు సామాజిక సేవ, సానుకూల దృక్పథంతో మెరుగైన అవకాశాలు వస్తాయన్నారు. ఈనెల 15న విజయవాడలో జరగనున్న ఎన్టీఆర్ ట్రస్ట్ చారిటీ షోలో పాల్గొనాలని విద్యార్థులను కోరారు. గౌరవ అతిథిగా హాజరైన తులసి రెడ్డి మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా వున్న సృజనాత్మను వెలికి తీయడానికే ఈ మహోత్సవాలన్నారు. చదువు అంటే పుస్తకాలు ఒక్కటే కాదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పాఠ్యాంశాలేనన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రసంగిస్తూ మహోత్సవాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఒకరితో మరొకరు ఎలా మెలగాలి? బృంద సమూహంగా ఎలా పనిచేయాలనే విషయాలు తెలుస్తాయన్నారు. ఎవరైతే ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారో వారే అందరికంటే ముందుగా జీవితంలో స్థిరపడతారన్నారు. వేడుకల్లో వీసీ ఆచార్య పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్ సీఈవో డాక్టర్ మేఘన తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం కార్యక్రమానికి హీరో విశ్వక్‌సేన్, హీరోయిన్ ఆకాంక్ష శర్మ, యాక్టర్ అభిమన్యు సింగ్ రానున్నారు.

మహోత్సవ్‌లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించారు. తొలుత నిర్వహించిన స్పోర్ట్స్ ఫీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన వంటి తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ప్రారంభించారు. వీటితో పాటు మ్యూజిక్, లిటరసీ, స్పాట్‌లైట్, డాన్స్ డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్‌మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కల్చరల్స్, థియేటర్ ఆర్ట్స్ తదితర పోటీలు నిర్వహించారు.

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



పల్నాడు ఎక్స్‌ప్రెస్ లోకో ఫెయిల్యూర్

- 2 గంటల 25 నిమిషాలు ఆలస్యంగా వికారాబాద్‌కు చేరిక
- దీని ప్రభావంతో రిటర్న్ పల్నాడు రీషెడ్యూల్
- తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ఎక్స్‌ప్రెస్ గురువారం ప్రయాణికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. నంబరు. 12747 గుంటూరు నుంచి వికారాబాద్‌కు వేకువజామున 5.45కి బయలుదేరిన ఈ రైలు లోకో(ఇంజిన్)లో సాంకేతికలోపం తలెత్తింది. పిడుగురాళ్ల - నడికుడి సెక్షన్‌లో సమస్య తలెత్తడంతో అక్కడే గంటన్నరకు పైగా ఆలస్యమైంది. ఇక నల్గొండ - సికింద్రాబాద్ సెక్షన్‌లో మరింత ఆలస్యం కావడంతో దాదాపుగా 3.30 గంటల ఆలస్యంగా సికింద్రాబాద్‌కు చేరింది. అక్కడి నుంచి బయలుదేరి గమ్యస్థానమైన వికారాబాద్‌కు 2 గంటల 25 నిమిషాల ఆలస్యంగా చేరుకొంది. ఈ కారణంగా రిటర్న్ పల్నాడు ఎక్స్‌ప్రెస్ నంబరు. 12748 వికారాబాద్ - గుంటూరు రైలుని గంట 40 నిమిషాల ఆలస్యంగా బయలుదేరేలా రీషెడ్యూల్ చేశారు. అయితే ఆ సమయంలో రెగ్యులర్ రైళ్లకు పాత్ ఉండటంతో 10 గంటలకు కూడా మిర్యాలగూడ చేరుకోలేదు. ఈ రైలు గుంటూరుకు చేరుకోవడానికి అర్ధరాత్రి 12 గంటలు అవుతుందని రైల్వే ఎంక్వయిరీ సిబ్బంది తెలిపారు. దీంతో ఉదయం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లిన ప్రయాణీకులు, మధ్యాహ్నం అటు నుంచి గుంటూరుకు బయలుదేరి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో దిగి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణీకులకు ఆయా స్టేషన్లలో లింకు బస్సులు వెళ్లిపోవడంతో చేసేది లేక ఆటోలలో బయలుదేరాల్సిన పరిస్థితి తలెత్తింది.

ఆరబెట్టిన మిర్చిని తీసుకురావాలి

- రైతులకు మిర్చియార్డు కార్యదర్శి చంద్రిక సూచన


మిర్చియార్డులో సిబ్బందితో కలిసి పర్యటిస్తున్న సెక్రెటరీ చంద్రిక

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులు మిరప కాయలను బాగా ఆరబెట్టిన తర్వా తే మిర్చి యార్డుకు తీసుకురా వాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక సూచించారు. గురువారం ఆమె యార్డు సిబ్బందితో కలిసి మార్కెట్ కమిటీ ప్రాంగణంలో పర్యటించారు. పలుచోట్ల కమీషన్ దుకాణాల ఎదుట మిర్చిని ఆరబోసి ఉండటాన్ని ఆమె గమనించారు. రైతులు తీసుకొచ్చే మిర్చిలో తేమ శాతం ఉండకుండా చూసుకోవాలన్నారు. అలానే యార్డు ప్రదేశంలో మిర్చి ఆరబెట్టడం వలన ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం భోజనశాలని సందర్శించి రైతులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతని పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ గ్రేడ్‌ల సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, ఆంజనేయ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ 2.0.. ఆమోదం

(5వ పేజీ తరువాయి)

స్థానిక సంస్థ వాటా నిధులను 15వ ఆర్థిక సంఘం నుంచి వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మునిసిపాలిటీలపై నిధుల భారం తప్పనుంది.

గతంలో నిలిచిన పనులకు మోక్షం

అమృత్ పథకం కింద చిలకలూరిపేటలో రక్షిత మంచి నీటి పథకం విస్తరణ టీడీపీ హయాంలో రూ.145 కోట్లతో చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం నిధులను నిలిపివేయడంతో పనులు ఆగిపోయాయి. దీంతో ఈ పథకాన్ని అమృత్ 2.0 కింద చేర్చారు. రూ.116 కోట్లతో పథకాన్ని పూర్తి చేసేలా అంచనాలను రూపొందించారు. చిలకలూరిపేట తరహాలోనే ఇతర మున్సిపాల్టీలలో నిధుల కొరతతో నిలిచిపోయిన పనులను పూర్తిచేసేందుకు డీపీఆర్‌లు సిద్ధం చేశారు. మున్సిపాల్టీలలో రానున్న 25 ఏళ్ల ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి పథకాలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

కలుషిత జలాలు శుద్ధి..

తాగునీటి పథకాల అభివృద్ధితో పాటు మురుగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అమృత్‌పథకంలో పెద్దపీట వేస్తున్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపడుతున్నారు. గుంటూరు, నరసరావుపేట పట్టణాల్లో ఇప్పటికే భూగర్భ డ్రెయినేజ్ పథకాలు ఉన్నాయి. మిగతా మున్సిపాల్టీలలో మురుగు నీరు వాగుల్లో కలసి జలాలు కలుషితం అవుతున్నాయి.దీనిని పూర్తిగా నిరోధించేందుకు ప్రతి మున్సిపాల్టీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్లాంట్లను నిర్మించి మురుగు నీటిని శుద్ధి చేసిన అనంతరం నీటిని బయటకు పంపుతారు. మునిసిపాలిటీల పరిధిలో ఉన్న తాగునీటి చెరువులను కూడా అభివృద్ధి చేయనున్నారు. భూగర్భ జలాలు పెంచే దిశగా చెరువులను పునరుద్ధరించనున్నారు.

చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్ పేరుతో టోకరా

చిలకలూరిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు ఇక్కడ కొత్త తరహా మోసానికి తెరలేపారు. 6300805117 నుంచి పట్టణంలోని పలువురు వ్యాపారులకు ఫోన్‌చేసి ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించనందున దుకాణాలు సీజ్ చేస్తామని బెదిరిస్తున్నారు. తక్షణం 9014544417 నంబరుకు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. దీనితో కంగారుపడిన కొందరు ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తెచ్చారు. జరుగుతున్న మోసాన్ని గమనించిన కమిషనర్ పి.శ్రీహరిబాబు ఈ విషయాన్ని చిలకలూరిపేట అర్బన్ సీఐ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఇటువంటి ఫేక్ కాల్స్ ను నమ్మవద్దని కమిషనర్ కోరారు.

పల్నాడు వార్తలు

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

ప్లాస్టిక్ రహిత నరసరావుపేటకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

● కమిషనర్ జస్వంత్‌రావు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత నరసరావుపేటకు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ జస్వంత్‌రావు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జాతీయ హరిత ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు ఉత్తర్వులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జూలై 1, 2022 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, 19రకాల ప్లాస్టిక్ వస్తువులను నిషేధించారని, ఆయా ప్లాస్టిక్ వస్తువులు విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. నరసరావుపేట పట్టణంలో ఈ నెల 10వ తేదీ నుంచి నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, 19రకాల ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించడం జరుగుతుందన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే వారిపై రూ.20,000నుంచి రూ.5 లక్షల వరకు అపరాధ రుసుం, ఐదు సంవత్సరాల వరకు జైలుశిక్ష విధిస్తారని హెచ్చరించారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి: నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల ప్రతిష్ఠ పెంచాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఘన వ్యర్థాల నిర్వహణ: మోహనరావు

యడ్లపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీలు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎస్ఐఆర్‌డీ) సీనియర్ ఫ్యాకల్టీ మోహనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐటీసీ, అసిస్ట్ సంస్థల ఆధ్వర్యంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికల (జీపీడీపీ) రూపకల్పనపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, క్లాప్ మిత్రలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీసీ కో-ఆర్డినేటర్ వెంకయ్య, ఎంపీడీవో హేమలతాదేవి, ఈవోపీఆర్డీ జాకీర్‌హుస్సేన్, అసిస్ట్ ప్రతినిధి బాబ్జీ పాల్గొన్నారు.

సైబర్ భద్రత ఎంతో ముఖ్యం: కొత్తపల్లి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నేటి సాంకేతిక యుగంలో వ్యక్తిగత భద్రత కాపాడుకోవడానికి సైబర్ భద్రత ఎంతో అవసరమని నేషనల్ సెక్యూరిటీ డేటాబేస్, సర్టిఫైడ్ సైబర్ క్రైమ్ ఇంటర్వెన్షన్ ఆఫీసర్ కొత్తపల్లి ప్రదీప్ అన్నారు. గురువారం ఎఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్‌లో వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో అడ్వాన్స్‌డ్ ఇన్ జీనోమిక్ డీఎన్ఏ, హెచ్‌పీఎల్‌సీ మెథడ్స్‌పై వర్క్‌షాప్ గురువారం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ తెలిపారు. ప్రధాన అతిథిగా కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, డాక్టర్ డీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం గురవయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాస సాయి తదితరులు ప్రసంగించారు.

ముప్పాళ్ళ చెన్నయ్యకు ఘన నివాళి

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గురప్పనాయుడుపాలెం మాజీ సర్పంచ్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పాళ్ళ చెన్నయ్య 9వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కారంపూడిరోడ్డులోని చెన్నయ్య విగ్రహానికి ఆయన కుమారుడు, ఏజీపీ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, ముప్పాళ్ళ నారాయణమ్మ కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం

పోట్లూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెండ్రోజుల క్రితం అదృశ్యమైన శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన వృద్ధుడి మృతదేహం గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో గురువారం లభ్యమైనట్లు ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పోట్లూరు గ్రామానికి చెందిన తూమాటి రామాంజనేయులు (73) ఈ నెల 4వ తేదీన కంటికి వైద్యం చేయించుకుంటాని వెళ్లి అదృశ్యమయ్యాడు.

కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

ఈపూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని యర్రబాలెంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన వజ్జా ఆంజనేయులుపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. క్షతగాత్రుడికి ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి నర్సరావుపేట ఏరియా ఆసుపత్రికి పంపించారు.

లక్షల ఖర్చుతో నిర్మించారు.. వదిలేశారు..!

- ● ఆరు గ్రామాల్లో నిరుపయోగంగా మల్టీ సర్వీస్ సెంటర్లు
- ● వినియోగంలోకి రాని అనుసంధానంగా నిర్మించిన వేబ్రిడ్జి
- ● బిల్లులు రాక సొసైటీలకు అప్పగించని కాంట్రాక్టర్లు
- ● మతుకుమల్లి, గుంటుపాలెంలో పూర్తికాని పనులు
- ● నిర్మించినా ప్రయోజనం లేదని రైతుల్లో ఆవేదన



కనమర్లపూడి సమీపంలో నిరుపయోగంగా ఉన్న వేబ్రిడ్జి



మతుకుమల్లిలో నిరుపయోగంగా ఉన్న మల్టీ సర్వీస్ సెంటర్

శావల్యాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మల్టీసర్వీస్ సెంటర్లు వాటికి అనుసంధానంగా నిర్మించిన వేబ్రిడ్జి నిర్మాణాలన్నీ నేడు నిరుపయోగంగా మారాయి. లక్షలకొద్దీ ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన కట్టడాలన్నీ నిరుపయోగంగా మారడంతో రైతుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనులుచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండానే వైసీపీ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడంతో తమకు చివరి బిల్లులు రాలేదన్న కారణంగా పనులు పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్లు సొసైటీలకు అప్పగించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. మల్టీసర్వీస్ సెంటర్‌లలో రైతులు నిల్వచేసుకొన్న పంటలకు సొసైటీ వారు రుసుమును వసూలుచేసి నాబార్డు వారికి కిస్తీల రూపంలో తీసుకొన్న రుణాన్ని వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు వాటి నుంచి ఎటువంటి ఆదాయం రాకపోవడంతో కిస్తీలు చెల్లించడం సొసైటీలకు భారంగా మారింది. సొసైటీల ఆర్థిక పరిస్థితి పరిగణనలోకి తీసుకోకుండానే అప్పటి ప్రభుత్వం మల్టీసర్వీస్ సెంటర్‌ల నిర్మాణాల భారాన్ని సొసైటీలపై మోపిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. దానికి తోడు పంచాయతీల నుంచి ప్లాన్ అప్రూవల్ కూడా తీసుకోకుండానే మల్టీసర్వీస్ సెంటర్‌ల నిర్మాణాలను చేయడం గమనార్హం.

నాబార్డు వారి ఆర్థిక సహకారంతో శావల్యాపురం సొసైటీ పరిధిలోని వేల్పూరు, పోట్లూరు, కొత్తలూరు, మతుకుమల్లి గ్రామాల్లో, కారుమంచి సొసైటీ పరిధిలోని కారుమంచి గుంటుపాలెం గ్రామాల్లో మల్టీపర్పస్ గోడౌన్‌లను నిర్మించారు. వేల్పూరులో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో, మిగిలిన ఐదుచోట్ల 500మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోడౌన్‌లు నిర్మించారు. 1000 మెట్రిక్ టన్నుల గోడౌన్‌కు రూ.77లక్షలు, 500 మెట్రిక్ టన్నుల గోడౌన్‌లకు రూ.40లక్షల చొప్పున నిధులను కేటాయించారు. సొంత పార్టీకి చెందిన నేతలే కాంట్రాక్టులు దక్కించుకొని పనులను ప్రారంభించారు. వేల్పూరు, పోట్లూరు, కొత్తలూరు, కారుమంచి గ్రామాలలో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ కాంట్రాక్టర్లకు చివరి విడత బిల్లులు చెల్లించకపోవడంతో వారు సొసైటీలకు అప్పగించలేదు. మతుకుమల్లి, గుంటుపాలెం గ్రామాల్లో గోడౌన్‌ల లోపల ఫ్లోరింగ్ డంపింగ్ యార్డు నిర్మాణం వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. మతుకుమల్లిలో లోతట్టు ప్రాంతంలో గోడౌన్ నిర్మాణం చేపట్టడంతో పాటు కనీసం మెరక కూడా చేయకపోవడంతో వర్షాకాలం ఆవరణలో వర్షపునీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారనుంది. గోడౌన్‌లను ప్రారంభించినప్పటికీ కొన్నిచోట్ల గ్రామాల వెలుపల ఉండడంతో పంటలు నిల్వ చేసేందుకు రైతులు ఆసక్తి చూపకపోవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లోతట్టు ప్రాంతంలో వేబ్రిడ్జి నిర్మాణం

మల్టీపర్పస్ గోడౌన్‌లకు అనుసంధానంగా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కన మండలంలోని కనమర్లపూడి సమీపంలోని ప్రభుత్వ భూమిలో వేబ్రిడ్జిని నిర్మించారు. నిర్మాణం పూర్తయి సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు వేబ్రిడ్జిని ప్రారంభించలేదు. వే బ్రిడ్జిని కూడా లోతట్టు ప్రాంతంలో నిర్మించడంతో వర్షాకాలం వేబ్రిడ్జికి చుట్టు వర్షపునీరు నిలబడుతున్నాయి. జాతీయ రహదారి పైనుంచి అధిక లోడుతో వాహనాలు వేబ్రిడ్జి వద్దకు వెళ్ళాలంటే ప్రమాదాలు జరిగే అవకాశముందని రైతులు వాపోతున్నారు. వేబ్రిడ్జి నిర్మించేప్పుడు రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు పలుమార్లు స్థలపరిశీలన చేసినప్పటికీ అక్కడున్న సమస్యలు గుర్తించకపోవడం పలు రకాల విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి మల్టీ సర్వీస్ సెంటర్‌లు, వేబ్రిడ్జి నిర్మాణాలను రైతులకు అందుబాటులోకి తేవాలని, రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేలా తగిన చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

ఘాట్ రోడ్డు, రామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణాన్ని పూర్తిచేస్తాం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వినుకొండకే తనమానికమైన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంతోపాటు ఘాటురోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి గురువారం వెల్లటూరు రోడ్డులోని ఘాట్ రోడ్డును పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డుకు అడ్డంగా జారిపడిన బండరాళ్లను పరిశీలించారు. కింద నుంచి మొదటి మలుపు రోడ్డులో వర్షం తాకిడికి కోతకు గురైన రోడ్డును చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కొండ పై గుడికి సమీపంలోని రెండు కొండల మధ్య కొండపై రాళ్లు విరిగిపడడంతో కనీసం వాహనాలు కూడా పైకి వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. సుమారు రెండు గంటలపాటు కాలినడకన కొండకు చేరుకున్నారు. అనంతరం కొండపై అర్థాంతరంగా ఆగిపోయిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల సూచనల మేరకు పనులు చేపట్టకుండా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సొంత నిర్ణయాలతో నాశిరకంగా పనులు చేపట్టారని విమర్శించారు. గతంలో చేపట్టిన పనులకంటే నేడు మరలా పదిరెట్లు అదనపు ఖర్చులతో పనులు చేపట్టాల్సి ఉందని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూ నూతనంగా పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ నెల 11వ తేదీన ప్రముఖ ఇంజనీర్లతోపాటు, స్తపతి సాయంతో ఘాట్‌రోడ్డును, ఆలయ నిర్మాణాన్ని పరిశీలించి నూతన కమిటీ నిర్మించి పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ గతంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతోపాటు పలుమార్లు ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించామని, బొల్లా స్వార్థం కోసం కాంట్రాక్టర్‌ను తొలగించి బినామిలతో పనులు చేపట్టి నాశిరకం పనులు కారణంగా ఘాట్‌రోడ్డుకు నేడు ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నిశంకర శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు మేడం రమేష్, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, దేవదాయశాఖ అధికారులు తదితరులు ఉన్నారు.



ఘాట్‌రోడ్డుపై పడిన బండరాళ్ళను పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు, తదితరులు

వేద పాఠశాల విద్యార్థి ఆత్మహత్యపై విచారణ

సుమోటోగా కేసు విచారణ చేపట్టిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటప్పకొండ వద్ద టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వర వేద విజ్ఞాన్ పీఠంలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగో ఏడాది చదువుతున్న సాయి శివసూరజ్ (16 సంవత్సరాలు) గత నెల 8వ తారీఖున ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. ఈ కేసును సుమోటోగా తీసుకొని విచారణ చేస్తున్నామని ఈ నేపథ్యంలో వేద పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి జరిగిన సంఘటనపై విద్యార్థులతో నేరుగా మాట్లాడటం జరిగిందన్నారు. వేద పాఠశాల ప్రిన్సిపాల్, గురువులను సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి వేద పాఠశాలలో 147 మంది విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వారికి అందుతున్న సౌకర్యాలను గురించి ఆరా తీశారు. హాస్టల్లోనే వంటశాలను డైనింగ్ హాలును, వసతి గృహాల రికార్డులను వారికి పెట్టే ఆహారాన్ని పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాలు అపరిశుభ్రంగా ఉన్నదని ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి మానసిక పరిస్థితి వైద్య సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రతి నెల మండల అధికారులు వేద పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టాలని, విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించాలని బూస్టరు వ్యాక్సిన్, టీకాలు ఇవ్వాలని జిల్లా వైద్యశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సంఘటనపై ఎఫ్ఐఆర్ నమోదయిందని బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చట్టపరమైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి డిప్యూటీ తహసీల్దార్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్ఐసీ వై ప్రశాంత్ కుమార్ పీడీ ఆఫీసు పీవో ఆదిలక్ష్మి ఈవో ఆఫీస్ అంగన్వాడీ సూపర్‌వైజర్లు ఎం.వాణి జి.పార్వతి అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కోటప్పకొండ వేద పాఠశాలను పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యులు



అవార్డును అందుకుంటున్న ఇంజనీర్ కమలాకర్‌రెడ్డి

ఇంజనీర్ కమలాకర్‌రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు

ననరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సివిల్ ఇంజనీర్ కమలాకర్‌రెడ్డి ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకున్నారు. నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్‌కే హోటల్ 7ఇన్‌కు రాష్ట్రస్థాయి అవుట్ స్టాండింగ్ కాంక్రీట్ స్ట్రక్చర్ కమర్షియల్ అవార్డుకు ఎంపికైంది. ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికైన హోటల్ నిర్మాణానికి ఇంజనీరుగా పనిచేసిన విజయలక్ష్మి ప్లానర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ అధినేత కొమ్మసాని కమలాకర్‌రెడ్డికి, నిర్మాణదారుడు గడ్డం వేంకటేశ్వరరెడ్డికి విజయవాడ హయత్ ప్లేస్ హోటల్‌లో గురువారం ఈ అవార్డును బహూకరించారు. ఇంజనీరు కమలాకర రెడ్డి గత 29 సంవత్సరాలుగా నిర్మాణరంగంలో విశేష సేవలు అందిస్తున్నారు. వాణిజ్య, నివాస భవనాలు, సమాజానికి ఉపయోగపడే ఐకానిక్ గడియారపు స్తంభం వంటి నిర్మాణ ప్రాజెక్టుల పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహించారు. అంతేగాక, గతంలో పలు జాతీయ స్థాయి అవార్డులను కూడా అందుకున్నారు.

పాల ఉత్పత్తిదారులకు అండగా సంగం డెయిరీ: జోనల్ మేనేజర్ నరేష్

ఈపూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సంగం డెయిరీ అండగా ఉంటుందని జోనల్ మేనేజర్ కాట్రా నరేష్ అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ సంగం డెయిరీ పాలకేంద్రం పాల ఉత్పత్తిదారుడు ఊట్ల నరసింహారావు మృతిచెందగా నామిని భార్య లక్ష్మికి రూ.60వేలు చెక్కును గురువారం రాత్రి పాలకేంద్రం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నరేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సీహెచ్ కృష్ణారెడ్డి, ఎన్‌వీ కిరణ్, వేతన కార్యదర్శి వీ శ్రీనివాసరావు, ఎస్.కోటయ్య, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ.. పలువురికి గాయాలు

పాలపాడు (నరసరావుపేట రూరల్) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలపాడు గ్రామంలో ఆస్తి వివాదం నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇరు కుటుంబాలకు చెందిన పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం పాలపాడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రమణ భర్త రామారావు, తమ్మిశెట్టి భాగ్యలక్ష్మి భర్త లక్ష్మయ్య కుటుంబాల మధ్య గత కొంతకాలంగా ఆస్తి వివాదం కొనసాగుతోంది. గురువారం ఉదయం వీరి మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై వీరు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. తిరిగి పాలపాడు గ్రామానికి వెళ్ళే దారిలో మరలా ఇరువురు ఘర్షణకు దిగారు. పలువురికి గాయాలు కావడంతో పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

పండ్ల రైతులకు మేలు చేయటమే లక్ష్యం: చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల రైతులకు మేలు చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ జివి ఆంజనేయులు అన్నారు. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామానికి చెందిన అడపాల రామకృష్ణ సాగుచేస్తున్న డ్రాగెన్ ఫ్రూట్స్‌తోపాటు తైవాన్ నిమ్మ పంటలను జీవీ ఆంజనేయులు అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుకు సీహెచ్‌సీలో అత్యవసర వైద్యసేవలు

ఈపూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు అత్యవసర వైద్యం అందించడానికి ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సేవలు అందుబాటులో ఉన్నాయని సీహెచ్‌సీ మెడికల్ సూపరిండెంట్ కే హేమలత గురువారం అన్నారు. సీహెచ్‌సీలో గుండెపోటుకు గురైన వారికి అందించే అత్యవసర సేవలపై అవగాహన కల్పించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్లలోని బాలా త్రిపుర సుందరి సమేత శంకరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేక పూజలను రొంపిచర్ల శ్రీనివాస శర్మ వైభవంగా నిర్వహించారు.

జగన్ జైలుకు వెళ్ళడం ఖాయం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో జగన్ జైలుకు వెళ్ళక తప్పదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం కేసులో సిట్ వేయగానే తాడేపల్లి ప్యాలెస్ వద్ద ఫైళ్లన్నీ తగలపెట్టారన్నారు. తాడేపల్లి వద్ద ఫైళ్ల దగ్ధం చేయడంలో గతంలో కూడా మిధున్‌రెడ్డిని కూడా జగన్ జైలుకు తీసుకువెళ్తున్నారన్నారు. అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యలు ప్రస్తావించకుండా జీతాలు ఎందుకు తీసుకుంటున్నారని ఈ సందర్భంగా ఆయన జగన్‌ను ప్రశ్నించారు. అసెంబ్లీకి రాని జగన్ సిగ్గుంటే రాజీనామా చేయాలని జీవీని డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరాల్లో 143 హామీలు అమలుచేశామని, ప్రజలకు పదేపదే అబద్ధాలు చెబితే ప్రజలు 11సీట్లుకు పరిమితం చేశారన్నారు. రూ.10.50లక్షల కోట్లు అప్పుల్లో ఉన్నా వడ్డీలు చెల్లిస్తూ సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తున్న ఘనత చంద్రబాబునాయుడుదే అన్నారు. బడ్జెట్ అనంతరం తల్లికి వందనం, రైతు సుఖీభవ వంటి పథకాలను అమలుచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీ రాష్ట్ర రైతు నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, పీవీ సురేష్ పాల్గొన్నారు.

ఆలపాటి విజయానికి కృషిచేయండి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చిలకలూరిపేట నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం కోరారు. ఆయన నివాసంలో పరిశీలకులు పోలంరెడ్డి దినేశ్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పుల్లారావు మాట్లాడుతూ బూత్, క్లస్టర్ ఇన్‌చార్జులు ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు ఎన్నికలలో పోలయ్యేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదా శివరావు, షేక్ టీడీపీ కరిముల్లా, జవ్వాజి మధన్ మోహన్, జాలాది సుబ్బారావు, గట్టినేని విజయ్ సాయి, షేక్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజర్వు సిబ్బందికి 15 రోజుల శిక్షణ


నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ సిబ్బందికి 15 రోజులు పాటు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం పోలీస్ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిబ్బందికి ప్రతి సంవత్సర నిర్వహించే ఒక ప్రత్యేక శిక్షణ కార్యక్రమం అన్నారు. శిక్షణలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిబాబు సిబ్బందికి పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ, అడ్మిన్ ఆర్ఐ రాజా, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, హోమ్‌గార్డ్ కృష్ణ పాల్గొన్నారు.

నరసరావుపేట 8వ వార్డులో పారిశుధ్య కార్యక్రమాలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎనిమిదో వార్డులో గురువారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చీపురు పట్టి వీధులు శుభ్రం చేశారు. మురుగు కాలువలో పూడిక తీశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ, మద్దిరాల ఎడ్ల జతకు ప్రథమ స్థానం

నాదెండ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాదెండ్ల నందికుంట విఘ్నేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న ఎండ్ల బండ లాగుడు పోటీల్లో సబ్ జూనియర్ల విభాగంలో ప్రకాశం జిల్లా మద్దిరాల ముప్పాళ్ళ గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరికి చెందిన ఎడ్ల జత 3613 అడుగులు బండ లాగి ప్రథమ బహుమతి సాధించింది. ప్రకాశం జిల్లా దర్గా గ్రామానికి చెందిన వెంకటకృష్ణ, పుచ్చకాయల శేషాద్రి చౌదరిలకు చెందిన కంబైన్డ్ ఎడ్లజత 3075 అడుగులు లాగి ద్వితీయ స్థానాన్ని సాధించింది. కృష్ణా జిల్లా పెద్దపులిపాక గ్రామానికి చెందిన గరికపాటి శ్రీధర్‌కు చెందిన ఎడ్ల జత 3056 అడుగులు లాగి తృతీయ స్థానాన్ని సాధించింది. గురువారం రాత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పుల్లారావు, వ్యాపారవేత్త ఉన్నం నరసింహారావులు విజేతలైన ఎడ్ల యజమానులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.



విజేతలకు జ్ఞాపిక అందిస్తున్న పుల్లారావు, నరసింహారావు

128 పదో తరగతి పరీక్షా కేంద్రాల ఏర్పాటు: డీఈవో

శావల్యాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి కామన్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 128 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ తెలిపారు. పాఠశాలలను తనిఖీ చేసేందుకు శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి విచ్చేసిన డీఈవో అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 26,596మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని, 16 సీ-గ్రేడు కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమేరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లో కూడా మధ్యాహ్న భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.